క్లుప్తంగా

శివరాత్రికి ఏర్పాట్లు పూర్తి

వెలిసిన పండ్ల దుకాణాలు

శంకర్‌పల్లి: మహా శివరాత్రి సందర్భంగా శుక్రవారం శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలో పెద్ద, పెద్ద పండ్ల దుకాణాలు వెలిశాయి. దీంతో పాటు పూల వ్యాపారులు కూడా ప్రత్యేక శాపులను ఏర్పాటు చేశారు. మండలంలోని చందిప్ప గ్రామంలోని మరకత శివాలయం, పట్టణ కేంద్రలోని దేవాలయాల్లో ప్రత్యేక పూజల కోసం అన్నీ ఏర్పాట్లు చేశారు.

పొంచి ఉన్న ప్రమాదం!

- ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయండి
- స్థానికుల మొర

కొత్తూరు: మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో ఎస్సీ కాలనీకి వెళ్లే ప్రధాన రోడ్డు ప్రక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెలు తక్కువ ఎత్తులో ఉండడంతో తీగలు వ్రేలాడుతూ ప్రమాదకరంగా తయారయ్యాయి. వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించిన ప్రమాదం సంభవించే అవకాశం లేకపోలేదు. దానికి తోడు ఇప్పటికే ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మేకలు, పశువులు విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడ్డట్లు పేర్కొంటున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి కంచె ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

ముగిసిన సర్వసభ్య సమావేశం

కేశంపేట: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సందర్భంగా మండల కేంద్రంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశం గురువారం వైస్ ఎంపీపీ అనురాధ పర్వత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ అనురాధ మాట్లాడారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రస్తుతం ఎజెండాతోనే రానున్న సర్వసభ్య సమావేశంలో చర్చిస్తామన్నారు. అనంతరం వెంటనే ఈ సమావేశాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంపీటీసీలు, మండల అధికారులు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డులో లైట్లు ఏర్పాటు చేయండి

బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగరాజుచారి

కొత్తూరు: మండలకేంద్రం సమీపంలోని వై జంక్షన్ కూడలి నుంచి జేపీదర్గా వరకు బైపాస్ మధ్యలో బటర్‌ఫ్లై ఎల్‌ఈడీ లైట్లను ఏర్పాటు చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగరాజుచారి గురువారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు. లైట్లు లేని కారణంగా రాత్రి వేళల్లో కూడళ్ల దాటే క్రమంలో స్థానికులు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. సమస్యను పలుమార్లు ఎన్‌హెచ్ ఏఐ, సంబంధిత శాఖలకు చెందిన అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు.

బాలికలను వేధిస్తే కఠిన చర్యలు

షాద్‌నగర్ రూరల్: బాలికలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని షీటీం ఏఎస్ఐ గోపాల్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రసూల్ ఆధ్వర్యంలో షీ టీం బృందం మహిళలపై జరుగుతున్న ఘటనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీం ఏఎస్ఐ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ బాలికలు భయాన్ని వీడి ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. ప్రణాళికలను రూపొందించుకొని నిరంతరం లక్ష్య సాధన కోసం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో షీ టీం హెడ్ కానిస్టేబుల్ బుచ్చయ్య, సిబ్బంది ప్రహ్లాద్, క్రిష్టయ్య, రేష్మ, భార్గవి, ఉపాధ్యాయులు జ్ఞానేశ్వరి, అర్చన తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

షాద్‌నగర్ రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాసుమల్లగూడ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు నర్సింలు ఆధ్వర్యంలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులుగా స్వాతి, ఉపాధ్యాయులుగా శ్రీజ, శ్లోక, ప్రూటీ, శ్రవణ్‌కుమార్, హర్షవర్ధన్, విరాట్‌వర్ధన్, సాగర్ వ్యవహరించారు. ఎంఈఓ శంకర్ రాథోడ్ హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థి మహనీయుల జీవిత చరిత్రలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటప్ప, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీను, విద్యావాలింటీర్ షబానాభేగం, అంగన్‌వాడీ టీచర్ అనూష పాల్గొన్నారు.

వెంకటగిరి కొండపై హోమం

నందిగామ: మండల పరిధిలోని నర్సప్పగూడ వెంకటగిరి కొండపై గ్రామస్తులు శివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం గణపతి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, శివ లింగాన్ని ఊరేగింపుగా తీసెకెళ్లి పూజలు నిర్వహించారు. అనంతరం శివ లింగాన్ని ప్రతిష్ఠించి వేద పండితుల మంత్రోచ్ఛరణలతో నిర్వహించారు.

మహిళలను గౌరవించడం బాధ్యత

- చేవెళ్ల సీనియర్, జూనియర్‌కోర్టు జడ్జిలు శ్రీదేవి, కిరణ్‌కుమార్
- ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదగాలి
- కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ సంయుక్త
- ఘనంగా మహిళా దినోత్సవం


చేవెళ్ల: మాట్లాడుతున్న జడ్జి కిరణ్‌కుమార్, శ్రీదేవి


షాద్‌నగర్ రూరల్: రాజ్యలక్ష్మిని సన్మానిస్తున్న న్యాయవాదులు

చేవెళ్ల: మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడు మహిళాసాధికారత సాధ్యమవుతుందని చేవెళ్ల సీనియర్, జూనియర్‌కోర్టు జడ్జిలు శ్రీదేవి, కిరణ్‌కుమార్‌లు పేర్కొన్నారు. సీనియర్, జూనియర్‌కోర్టులో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం బార్‌అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ మహిళ చదువుకోవాలని సూచించారు. మహిళల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని, వాటి గురించి అవగాహన కల్పించాలన్నారు. మహిళలను ప్రతిఒక్కరూ గౌరవించి, వారి ఎదుగుదలకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల కోర్టుబార్ అసోషియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, సీనియర్ న్యాయవాదుల పాండురంగారెడ్డి, రఘునాథ్‌రెడ్డి, మహేశ్, నాగిరెడ్డి, జైపాల్, జనార్దన్, గీత తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్: మహిళలు ఇంటిని చక్కదిద్దుకోవడమే కాదు.. ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదగాలని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ సంయుక్త అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలోని అరిస్టాటిల్ పీజీ కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. అనంతరం మహిళ అధ్యాపకులకు, విద్యార్థినులకు క్రీడలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు దీపాలి, శ్వేత, జ్యోతిక సోని, త్రివేణి, విద్యార్థులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ రూరల్: సృష్టిలో స్త్రీ ప్రాముఖ్యత ఎంతో గొప్పదని సీనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని షాద్‌నగర్ కోర్టు కాంప్లెక్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి రాజ్యలక్ష్మితో పాటు మహిళా న్యాయవాదులు, సిబ్బందిని పూలమాలలు, శాలువా కప్పి సన్మానించారు. అనంతరం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ మహిళలకు స్వేచ్ఛనిస్తే అన్ని రంగాలలో రాణిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ అన్నపూర్ణ, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

షాబాద్: ఆత్మవిశ్వాసమే ఆయుధంగా అన్నిరంగాల్లో రాణించాలని డబ్ల్యూఎఫ్ఎల్ డైరెక్టర్ ఏకే జ్యోషి, నీతిజ్యోషి పేర్కొన్నారు. మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో వెల్స్‌పన్ ఫౌండేషన్ సీఎస్ఆర్ హెడ్ సురేఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ధైర్యంగా ఉండాలని, ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. సీఎస్ఈపీ జనరల్ సెక్రెటరీ ఆదిశేషమ్మ మాట్లాడుతూ మహిళలు శక్తి మణులు అని అనుకుంటే ఏమైనా సాధించగలరన్నారు.

మొయినాబాద్ రూరల్: జిల్లాలో దాదాపు 65 శాతం మంది మగువలు ఇళ్ల నిర్వహణ, పిల్లల బాగోగులు తదితర పనుల్లో రోజంతా బిజీగా ఉంటున్నారు. మరో 35 శాతం మంది కుటుంబాన్ని చక్కదిద్దుతునే మరో పక్క ఏదో ఒక పని చేస్తూ చేదోడు వాదోడుగా నిలుస్తున్నారని ఎంపీడీవో సంధ్య పేర్కొన్నారు.

అభివృద్ధికి కృషి

మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి

షాబాద్: గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మద్దూరు మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు రాంరెడ్డి పేర్కొన్నారు. గురువారం షాబాద్ మండల పరిధిలోని మద్దూరు గ్రామంలో రూ.5 లక్షల సొంత నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేని అభివృద్ధి, సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తుందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణానికి అధిక నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్‌గౌడ్, మల్లేల మల్లేశ్ యాదవ్, కమ్మరి నర్సింహ్మాచారి, మల్లేల మచ్చేందర్ యాదవ్, మల్లేల శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


పనులను ప్రారంభిస్తున్న నరేందర్‌రెడ్డి

విద్యార్థుల సామర్థ్యాలను పెంచండి


విద్యార్థులతో బోర్డుపై రాయించి, పరిశీలిస్తున్న నోడల్ అధికారి వెంకట్

దోమ: విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలని ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారి వెంకట్ సూచించారు. గురువారం మండల పరిధి కుమ్మరికుంటతండా ప్రాథమిక పాఠశాలను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లాల్యానాయక్‌తో కలిసి సందర్శించారు. తొలుత పాఠశాల పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించే దిశగా ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలన్నారు. ప్రతి ఒక్కొరికీ చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని చెప్పారు. ముఖ్యంగా తెలుగు, ఇంగ్లిష్, గణితం పిల్లలకు అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. అనంతరం ఎఫ్ఎల్ఎన్ వర్క్ షీట్స్‌ను పరిశీలించి, విద్యార్థులతో చదివించారు. ఉపాధ్యాయులు తయారు చేసిన బోధనోపకరణాలను చూసి అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవి, సీఆర్‌పీ రెడ్యానాయక్, ఉపాధ్యాయురాలు భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

కేశంపేట: మండల పరిధిలోని బోధునంపల్లి గ్రామంలో దయ్యాల పెంటయ్య అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి రూ. 5వేలు, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వర్కాల లక్ష్మీనారాయణగౌడ్ రూ. 5వేలు చొప్పున్న ఆర్థిక సహాయం అందజేశారు. దీన్ని గ్రామస్తులు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నీల పాండు, బీరప్ప, ఆంజనేయులు గౌడ్, బాలరాజు, బాలకృష్ణ, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై పోరాటం

- వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీను నాయక్


సభ్యత్వ నమోదు పత్రాలను అందజేస్తున్న శ్రీను నాయక్

షాద్‌నగర్: కార్మికుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామని వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీను నాయక్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీను నాయక్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేఖ విధానాలు చేపడుతున్నాయన్నారు. ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు ప్రభుత్వం కొలతలు లేకుండా రోజుకు రూ.600వేతనాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా 200వందల రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. పని ప్రదేశాల్లో కూలీలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు సమకూర్చాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీ డబ్బులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాములమ్మ, హంసమ్మ, జానమ్మ, పార్వతమ్మ, యాదమ్మ, సునీత, సరిత, జయమ్మ, లక్ష్మమ్మ, పద్మ, అంజమ్మ, అమృతమ్మ, రాజేశ్వరీ, సుగుణమ్మ, నర్సమ్మ, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో బీఎస్పీదే విజయం


మాట్లాడుతున్న విజయార్యక్షత్రియ

- బీఎస్పీ రాష్ట్ర కమిటీ నాయకుడు విజయార్యక్షత్రియ

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికల్లో బీఎస్పీదే విజయమని రాష్ట్ర నాయకుడు విజయార్య క్షత్రియ అన్నారు. చేవెళ్ల అసెంబ్లీ కార్యాలయంలో గురువారం అసెంబ్లీ అధ్యక్షుడు జీ. చందు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పలు కమిటీల అధ్యక్షులను నియమించి వారికి నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. రెండు సంవత్సరాలుగా పార్టీకోసం పనిచేస్తున్న మల్లి వెంకటేశ్‌ని చేవెళ్ల అసెంబ్లీ ఉపాధ్యక్షుడిగా, ఆలూరు గ్రామానికి చెందిన మొకురం కుమార్‌ను అసెంబ్లీ ప్రధాన కార్యదర్శిగా, మండల అధ్యక్షుడిగా ఆలూరు గ్రామానికి చెందిన మొకురం రాజులను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. కష్టపడే వారికి పార్టీ గుర్తిస్తుందని అసెంబ్లీ అధ్యక్షుడు జి చందు పేర్కొన్నారు. పార్టీ నిర్మాణంలో, బలోపేతానికి అందరం కలిసి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు

మొయినాబాద్ రూరల్: వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని మండల ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ మంచినీటి నల్లాల పరిశీలనతో పాటు ఇంటి పన్నుల వసూలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి సమస్యలు రాకుండా చేపట్టే చర్యలపై గ్రామ పంచాయతీ అధికారి, సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలు అడిగి తెలుసుకోవాలన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించాలన్నారు. మొయినాబాద్ మండలంలో 65 శాతం ఇంటి పన్నులు వసూలు అయ్యాయని తెలిపారు. వంద శాతం పూర్తి చేసేందుకు పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రంజిత్‌కుమార్, బిల్ కలెక్టర్ శ్రావణ్‌కుమార్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఇంటి పన్ను వసూలు చేస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

ధరణి దరఖాస్తుల పరిశీలన

మొయినాబాద్: భూ సమస్యలకు సంబంధించి రైతులు చేసుకున్న దరఖాస్తులను రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. గురువారం మండల పరిధిలోని చందానగర్, ఎనికేపల్లి, కనకమామిడి, సజ్జన్‌పల్లి గ్రామాల్లో రెండు బృందాలు పర్యటించి 110 దరఖాస్తులను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మోఖాపైకి వెళ్లి విచారణ చేపట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ గౌతమ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ వినోద్ కుమార్, ఆర్ఐలు చంద్రమోహన్, రోజా, సీనియర్ అసిస్టెంట్ సురేందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య తలెత్తకుండా చర్యలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్/నందిగామ: విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. గురువారం పట్టణంలోని విద్యుత్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవి కాలం ప్రారంభం కావడంతో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతుందన్నారు. రైతులకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరం సరఫరా చేయాలన్నారు. విద్యార్థులకు వార్షిక పరీక్షలు ప్రారంభం అయ్యాయని, విద్యుత్ కోతలు లేకుండా సరఫరా చేయాలన్నారు. అదేవిధంగా కొత్త కనెక్షన్ల కోసం ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే తక్షణమే విద్యుత్ కనెక్షన్లను ఇవ్వాలని సూచించారు. ఎస్ఈ గోపయ్య, డీఈ యాదయ్య, ఏడీలు రవీందర్, మాధవరావు, ఏఈలు పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణం

షాద్‌నగర్ రూరల్: విజయనగర్ కాలనీలోని శ్రీసహస్ర లింగేశ్వర వీరాంజనేయస్వామి దేవాలయంలో గురువారం పార్వతీపరమేశ్వరుల కల్యాణాన్ని ఆలయ అర్చకులు కేసీఆర్‌శర్మ, వెంకటకృష్ణ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణం అనంతరం దాత స్వాతిసంతోష్ అన్నదానం చేశారు.

సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ


సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన మధుసూదన్‌రెడ్డి

షాబాద్: మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ నగరంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేంవత్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌ని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సైనికులా కృషి చేయాలని సూచించారు. చేవెళ్ల ఎంపీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు కార్యకర్తలు సైనికుల పనిచేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రూ.500లకే గ్యాస్, 200 యూనిట్లకు ఉచిత విద్యుత్ అందజేస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం వరంలాంటిందని, మహిళల సాధికారత కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. ఆరోగ్యశ్రీ పథకం పేదలకు వరంలాంటిదని అన్నారు. రూ. 2లక్షల రుణమాఫీ త్వరలో అమలు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

- జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల
- ప్రధానోపాధ్యాయురాలు భాగ్యమ్మ


ఓట్లను లెక్కిస్తున్న ఉపాధ్యాయులు

షాద్‌నగర్ రూరల్: ప్రతీ విద్యార్థి నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాగ్యమ్మ అన్నారు. గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు భాగ్యమ్మ ఆధ్వర్యంలో నమూనా ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఓటు ప్రాధాన్యత, ఎన్నికల నిర్వహణ, ఎన్నికల ప్రచారం, నాయకులను ఎన్నుకునే విధానంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా నమూనా ఎన్నికల ప్రక్రియలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. భోజన విరామం తరువాత ఎన్నికల అధికారులు ఓట్ల లెక్కింపు ప్రక్రియను చేపట్టారు. పాఠశాల కమిటీ అధ్యక్షుడిగా రాంచరణ్‌తేజ, సభ్యుడిగా యండీ అయాన్, కౌశిక్, పూజిత, భానుశ్రీ గెలుపొందారు. అనంతరం హెచ్‌ఎం భాగ్యమ్మ మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక దృక్పథాన్ని అలవర్చుకొని సమాజ సేవలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశోధన విద్యకు ప్రోత్సాహం

- కేఎల్ యూనివర్సిటీ ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ
- మోంగోడిబి ఇండియాతో అవగాహన ఒప్పందం

మొయినాబాద్ రూరల్: పరిశోధన విద్యలో విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేఎల్ యూనివర్సిటీ ముందుంటుందని ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణా ఆకెళ్ల పేర్కొన్నారు. గురువారం అజీజ్‌నగర్ సమీపంలోని కేఎల్ యూనివర్సిటీలో విజ్ఞానం, వనరుల మార్పిడిలో వ్యూహాత్మక భాగస్వామ్యంతో ఈ కళాశాలలో టెక్నాలజీ డెటాబెస్ మెనేజ్‌మెంట్ అప్లికేషన్ డెవెలప్‌మెంట్ చేసేందుకు ఆవిష్కరణ, పరిశోధనలకు మోంగోడిబి ఇండియాతో ఒప్పందం చేసుకున్నారు. మేనేజర్ బసవ దర్శన్, కేఎల్ యూనివర్సిటీ ప్రిన్సిపాల్ రామకృష్ణలు ఎంఓయూపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకులు పరిశోధకుల కోసం సమగ్ర అభ్యాసం, అభివృద్ధి వాతావరణాన్ని సూచించడానికి ఈ ఒప్పందం దోహదపడుతుందన్నారు. కేఎల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పార్థసారథి వర్మ మాట్లాడుతూ ఈ ఒప్పందం ఎంతో మేలైందన్నారు. సాంకేతిక పరిశ్రమల్లో ప్రముఖ సంస్థ మోంగోడిబి ఇండియాతో భాగస్వామ్యం చేసుకోవడం వల్ల డేటా బేస్, మేనేజ్‌మెంట్, అప్లికేషన్, డెవలప్‌మెంట్, డైనమిక్ రంగాల్లో రాణించడానికి విద్యార్థులకు ఒక వేదికను సృష్టిస్తున్నామని తెలిపారు.